# వరుస చైన్ స్నాచింగ్‌లకు చెక్

## ఇద్దరు నిందితుల అరెస్ట్

### బంగారు ఆభరణాలు, బైకులు స్వాధీనం




**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనల్లో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు. నిందితుల వద్ద నుంచి బంగారు ఆభరణాలు, రెండు బైకులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.అరెస్ట్ అయినవారిలో కామ్రే ప్రణయ్ (30), జె.డి నగర్ గ్రామం, కమాన్‌పూర్ మండలం బైక్ మెకానిక్, షేక్ షఫీయుద్దీన్ (జె.డి నగర్, కన్నాల మండలం) ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి 21.30 గ్రాములు, 20.45 గ్రాముల బంగారు పుస్తెల తాళ్లు, బజాజ్ డిస్కవర్ బైక్ (టీఎస్22 బి 0662), బజాజ్ పల్సర్ బైక్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.డీసీపీ వివరాల ప్రకారండ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇద్దరూ కలిసి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. 03-01-2025న కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో తిరుగుతూ ముసలి మహిళలను లక్ష్యంగా చేసుకుని ప్రణాళిక రూపొందించారు. 04-01-2025 తెల్లవారుజామున లద్నాపూర్ గ్రామం ఓసీపీ2 రోడ్డుపక్కన రేకుల షెడ్డు వద్ద నిద్రిస్తున్న ముసలమ్మపై దాడి చేసి బంగారు పుస్తెల తాడు తెంపుకుని పరారయ్యారు. ఆ బంగారాన్ని ప్రణయ్ ఇంట్లో దాచారు.తరువాత 11-10-2025న సెంటినరీ కాలనీ వీరాంజనేయ స్వామి గుడి సమీపంలో బైక్‌పై వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెల తాడును తెంపుకుని గోదావరిఖని వైపు పారిపోయారు. ఆ బంగారాన్ని షఫీయుద్దీన్ ఇంట్లో దాచారు. మళ్లీ 08-01-2026న బేగంపేట గ్రామంలో మరో ముసలామె మెడలోని బంగారు ఆభరణాన్ని తెంపేందుకు ప్రయత్నించగా ప్రజలు రావడంతో పరారయ్యారు.నేడు చోరీ చేసిన బంగారాన్ని మహారాష్ట్రలో అమ్మేందుకు కాలేశ్వరం వైపు వెళ్తుండగా సెంటినరీ కాలనీ వద్ద రామగిరి పోలీసులు వారిని పట్టుకున్నట్లు తెలిపారు.నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రామగిరి ఎస్ఐలు టి. శ్రీనివాస్, దివ్య, ముత్తారం ఎస్ఐ రవికుమార్, సిబ్బంది బి. రాజ్‌కుమార్, జి. ఓదెలు, డి. రమేష్‌లను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

# గ్రామాలలో మంచి పరిపాలన అందించాలి

**సర్పంచ్ ల శిక్షణ ముగింపు.**
**పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
**పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు.**






**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జనవరి-23:** శుక్రవారం పెద్ద కాల్వలోని మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో నూతన సర్పంచ్ లకు ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... నూతన సర్పంచ్ లకు గత 5 రోజుల పాటు అందించిన శిక్షణలోని అంశాలను రాబోయే ఐదు సంవత్సరాల పాటు దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో సుపరిపాలన అందించాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వచ్చిన మార్పులను కూడా సర్పంచ్ లు గమనించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటూ పంచాయతీ అభివృద్ధికి నిధులు ఎలా సమకూర్చుకోవాలి, గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, గ్రామంలో నూతన నిర్మాణాలకు, లే ఔట్ లకు అనుమతుల మంజూరుకు పాటించాల్సిన నియమ నిబంధనలు వంటి అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ... భారీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం మాత్రమే సర్పంచ్ కర్తవ్యం కాదని, గ్రామ పరిపాలన సరిగ్గా ఉండేలా సర్పంచ్ నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు సరిగ్గా వెలిగేలా చూడటం పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతి గ్రామ అభివృద్ధి కోసం అందరం కలిసి పని చేయాలని అన్నారు. రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ ప్రజల ఆశీర్వాదం ఉంటే 20 నుంచి 30 సంవత్సరాల పాటు సర్పంచ్ పదవిలో మనం కొనసాగుతామని ఎమ్మెల్యే తెలిపారు. చివరి ప్రాంతాలకు మిషన్ భగీరథ క్రింద త్రాగు నీరు సరిగ్గా అందని పక్షంలో అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని అన్నారు. గ్రామాల అభివృద్ధికి సీఎం నుంచి కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరి సహకారం ఉంటుందని అన్నారు. సర్పంచ్ ఎటువంటి ఒత్తిడులకు గురి కావద్దని, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం మనకు ఉన్న హక్కులు బాధ్యతలు గురించి తెలుసుకొని అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితి అధికారి వీర బుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేందర్ సంబంధిత ఆయా మండలాల మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం కార్పొరేషన్ ఇంచార్జీ కమిషనర్ ను బదిలీ చేయండి

- అధికార పార్టీ సహకరిస్తున్నదుకు వారికి బదిలీ ఉండదా?
- ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే బదిలీ చెయ్యాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రాధానా అధికారికి రాసిన లేఖలో కోరిన మద్దెల దినేష్**




**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ జనవరి 24** రాష్ట్రంలో మున్సిపల్ కమిషనర్ల బదిలీ కి ఒక రూల్...రామగుండం కమిషనర్ కు ఒక రూలా..? లేక రూలింగ్ పార్టీ అండ ..నా?

పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రామగుండం నగర పాలక సంస్థ ఇంచార్జీ కమిషనర్ ను బదిలీ చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి కి రాసిన లేఖ లో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) గా 2023 జూలై 22 న జిల్లాలో బాధ్యతలు తీసుకున్నారని , తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2023 నవంబర్ 30న జరిగిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రామగుండం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గా కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. అట్టి ఎన్నికల సమయంలో సుమారు 200కు పైగా పోలింగ్ బూత్ లలో అధికారులు ఓటర్ల సౌకర్యార్థం కొన్ని కాంట్రాక్టు పద్ధతిన ఏర్పాటు చేసిన సౌకర్యాలకు సంబందించిన నిధులలో అవకతవకలు జరిగాయని సంభదించిన నిధులు మాయం అయ్యాయని అనేక ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వారు పేర్కొన్నారు. అదే విధంగా తెలంగాణలో తదుపరి భారత సాధారణ ఎన్నికలు 18వ లోకసభకు 17 మంది సభ్యులను ఎన్నుకునేందుకు 2023 మే 13న ఎన్నికలు జరిగాయని,పార్లమెంట్ ఎన్నికలు జరిగినప్పుడు కూడ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా కూడా ఇట్టి అధికారి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గా వ్యవహరించడం జరిగిందని, ఇట్టి ఎన్నికలలో కూడ అధికారులకు, ఓటర్లకు సౌకర్యాలు కల్పించడంలో కాంట్రాక్టర్లకు పనులు అప్ప జెప్పితే నిధులు లెక్కలేవని, వాటిని ఇప్పటికి పనులు చేసిన వారికి నిధులు అందలేదని ఆరోపణలు అనేకం ఉన్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా 2023 నవంబర్ అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం జరిగిందని, తదనంతరం అదనపు కలెక్టర్ మరియు రామగుండం నగర పాలక సంస్థ ఇంచార్జీ కమిషనర్ గా వ్యవహారిస్తూ అధికారపార్టీ బలంతో అధికార పార్టీ నాయకురాలిగా చెలామణి అవుతూ తన వ్యవహారశైలిని మార్చుకోకుండా ముందుకు సాగుతుందని ఆయన ఆరోపించారు. రామగుండం నగర పాలక సంస్థకు కమీషనర్లు గా పనిచేస్తున్న అధికార్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అనేక రకాలుగా ఒత్తిడి చేయడం అలవాటుగా చేసుకొని వారు ట్రాన్స్ఫర్లు పెట్టుకొని వెళ్లే విధంగా ప్రణాళిక చేసిందని ఆయన ఆరోపించారు. ఇక ఇదే అదనుగా భావించి ఇట్టి అదనపు కలెక్టరే రామగుండం నగర పాలక సంస్థకు ఇంచార్జ్ కమిషనర్ గా 2024 సెప్టెంబర్ లో బాధ్యతలు తీసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. ఇంచార్జ్ కమిషనర్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి పూర్తి స్థాయిలో అధికార పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి విధేయురాలుగా ఉంటూ ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కేవలం కాంగ్రెస్ పార్టీకి, వారి నాయకులకు, స్థానిక ఎమ్మెల్యే మాత్రమే పనులు చేసుకుంటూ అనధికారిక కాంగ్రెస్ పార్టీ నాయకురాలిగా రామగుండం కార్పొరేషన్ లో కొనసాగుతుందని ఆయన ఆరోపించారు.రామగుండం నగర పాలక సంస్థలో పనులు చేస్తున్న సిబ్బందిని, కార్మికులను మానసికంగా కావాలనే నాన రకాలుగా ఇబ్బందులకు గురిచేయడం జరుగుతుందని ఆయన ఆరోపించారు.ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇట్టి అధికారిణి ఇంకా స్థానిక రామగుండం కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ గా కొనసాగితే మాత్రం అధికార పార్టీకి అన్ని రకాలుగా సహాయ సహకారాలు తాను అధికారాన్ని అంతా ఉపయోగించి వారి పార్టీ నేతలకు అన్ని రకాలుగా అనుకూలంగా పనిచేస్తుందని, ఇప్పటికే రామగుండం కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్ లు ఉంటే ప్రభుత్వం 60 కి పెంచిందని అందులో భాగంగా డివిజన్ ల పునర్ విభజన లో భాగంగా అధికార పార్టీ నేతలకు అన్ని రకాలుగా వాళ్ళు చెప్పినట్లు డివిజన్ల పునర్ విభజన చేసారని ఆయన ఆరోపించారు. ముసాయిదా, ఫైనల్ ఓటర్ లిస్టును పూర్తిగా తప్పుల తడకగా, అసలు డివిజన్ లో పర్యటించకుండా కేవలం కార్పొరేషన్ కార్యాలయంలో కూర్చొని అధికార పార్టీ నేతలు చెప్పినట్టు చేస్తున్న ఇంచార్జ్ కమిషనర్ విధుల్లో చేరి రెండు ఏళ్ళు పూర్తి అయినప్పటికీ కూడా అధికార పార్టీ అండదండలతో ఇంకా (స్థానిక సంస్థల) అదనపు కలెక్టర్ గా రామగుండం నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ గా కొనసాగుతుందని, కనుక ఆ అధికారిణి ఇలాగే కొనసాగితే పెద్దపల్లి జిల్లాకే ప్రమాదంగా మారే అవకాశం ఉందని, తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ స్పందించి పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా, రామగుండం నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ గా కొనసాగుతున్న అధికారిని వెంటనే బదిలీ చేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చూడాలని ఆయన ఎన్నికల ప్రధానాధికారికి రాసిన లేఖ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## డ్రైడే ఫ్రైడే కార్యక్రమంతో స్వచ్ఛతపై అవగాహన

**అగ్నిధార న్యూస్ కమాన్‌పూర్** శుక్రవారం కమాన్‌పూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన పిల్లిపల్లె ప్రాంతంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, చెత్తను వేరు చేయడం, నిల్వ నీరు లేకుండా చూసుకోవడం ద్వారా వ్యాధులను దూరం పెట్టవచ్చని ఈ సందర్భంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎండి రఫీక్ సోహెల్,పంచాయతీ సెక్రెటరీ మారుతి,ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని ఇంటింటికి వెళ్లి స్వచ్ఛత సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.

## సుభాష్‌నగర్‌లో ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి

**అగ్నిధార న్యూస్ కమాన్‌పూర్,** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో శుక్రవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి వేడుకలు సుభాష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుభాష్ యూత్ వ్యవస్థాపకులు, మాజీ ఎంపీపీ మల్యాల రాంచంద్రం గౌడ్ నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, “నీవు రక్తం ఇస్తే నేను స్వాతంత్ర్యం ఇస్తాను” అనే నినాదంతో యువతలో అగ్ని రగిలించిన నేతాజీ స్ఫూర్తి నేటి తరానికి కూడా అంతే ప్రాసంగికమని పేర్కొన్నారు. యువత దేశం కోసం ఆలోచించే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సాధన కోసం ఆయుధపోరాటానికైనా సిద్ధపడిన నేతాజీ ధైర్యం, దేశభక్తి తరతరాలకు మార్గదర్శకమని అన్నారు.సగర సంఘం అధ్యక్షుడు రేవల్లి శంకర్ మాట్లాడుతూ, ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపన ద్వారా భారతీయుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన నేతాజీ స్వయంకృషి, త్యాగాల ప్రతీకగా నిలిచారని కొనియాడారు.ఈ సందర్భంగా సుభాష్ యూత్ సభ్యులు నేతాజీ ఆశయాలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సుభాష్

## సీసీఎల్ ఉత్తర్వులు ఇవ్వాలి..!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** మండలం విద్యాధికారి విజయ్ కుమార్ కు టీ.ఆర్.టీ.ఎఫ్ ఉపాధ్యాయ సంఘం డైరీని శుక్రవారం ఆ సంఘం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా రెండు రోజుల సెలవు దినాలలో గ్రామ పంచాయతీ ఎలక్షన్ లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకి జిల్లా విద్యాధికారి ఉత్తర్వుల మేరకు మండలంలో కూడా రెండు రోజులు సీసీఎల్ ఉత్తర్వులు ఇవ్వాలని మండల విద్యాధికారిని కోరగా త్వరలోనే ఉత్తర్వులు ఇస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ. ఆర్ టీ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కటు కోజ్వల సంతోష్ కుమార్, మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవి కుమార్,మునీష్ కుమార్ లు పాల్గొన్నారు.

## ఆత్మీయ సన్మానం..!

**అగ్నిధార న్యూస్ కమన్పూర్** ఛత్రపతి శివాజీ యువసేన నూతన అధ్యక్షులు మల్యాల శేఖర్ గౌడ్, కమాన్ పూర్ 11వ వార్డ్ సభ్యులు మేరుగు కుమార్ లకు శాలువాలు కప్పి సిద్ధిపల్లె ఉప సర్పంచ్ కొత్తపల్లి సతీష్, సామాజిక కార్యకర్త ఇనగంటి మురళి మనోహర్ రావు లు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమం లో జంగపల్లి పెద్ద శ్రీనివాస్, చిన్న శ్రీనివాస్ పాల్గొన్నారు

## విజేతలకు బహుమతుల అందజేత

**-కమాన్ పూర్ మండల్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్**

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కమాన్ పూర్ మండలకేంద్రంలో ఈ నెల 21,22వ తేదీల్లో కమాన్ పూర్ మండల టోర్నమెంట్ జరిగినది. హోరహోరిగా జరిగిన బ్యాట్మెంటన్ లో మొదటి విజేతలుగా పొందిన మేడగొని సాయికిరణ్, కోలేటి మహేష్ టీం, రెండవ విజేత కల్వల రాకేష్ ,బుర్ర సాయికిరణ్ టీం గెలుపొందగా, మొదటి విజేతలకు 2000/- రూ. దొనికెన వినయ్, రెండవ విజేతలకు గుజ్జ రణధీర్ 1000/- రూ లు అందజేయగా. అలాగే గెలుపొందిన వారికి దొనికెన సదానందం, పెండ్యాల సంతోష్ ల స్మరాకార్ధంగా షీల్డ్ లు మేడగొని సాయి కిరణ్ అందజేశారు.

## ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ హ్యూమానిటీ

**తెలంగాణ ఉద్యమకారుడి కుమారుడికి ఫీజులో రాయితీ**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):** క్రమశిక్షణ, విజయంలో చిరునామాగా పేరొందిన ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ మానవత్వానికీ నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది. తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త దేవి లక్ష్మీనర్సయ్య కుమారుడికి ఫీజులో రాయితీ ప్రకటించి పెద్ద మనసు చాటుకుంది.సమాజానికి ఇప్పటివరకు అనేక మంది సైనికులను అందించిన ఈ అకాడమీ, విద్యార్థులను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. లక్ష్మీనర్సయ్య సమాజ సేవలను గుర్తించిన అకాడమీ చైర్మన్ సతీశ్ రెడ్డిడ ఆయన కుమారుడు దేవి రితిక్‌కు ఇంటర్ సెకండియర్ విద్యతో పాటు హాస్టల్ వసతుల్లో ఫీజు రాయితీ కల్పించి మానవత్వాన్ని చాటారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దేవి లక్ష్మీనర్సయ్య, ఉద్యమం కోసం పోలీస్ ఉద్యోగాన్ని తృణప్రాయంగా త్యజించి పూర్తి సమయం సమాజ సేవకు అంకితం చేశారని తెలిపారు. ఇప్పటికీ తన పెన్షన్‌లో 30 శాతం పేద విద్యార్థుల చదువుకు ఖర్చు చేస్తూ ఎందరో నిరుపేదల భవిష్యత్తుకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.అయితే గత పాలకులు ఆయన త్యాగాన్ని గుర్తించలేదని, పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కూడా ఉద్యమకారుడైన లక్ష్మీనర్సయ్యను పట్టించుకోలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సొంత ఇల్లు లేకున్నా ఉన్నత వ్యక్తిత్వంతో సమాజ సేవ చేస్తోన్న లక్ష్మీనర్సయ్య సేవలను గుర్తించి డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీశ్ రెడ్డి ఫీజు రాయితీ ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది

## ఘనంగా వసంత పంచమి సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/ గండీడ్:** మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వా ల్ ప్రాథమిక పాఠశాల లో వసంత పంచమి సందర్భంగా సరస్వతి దేవి చిత్రపటానికి పూల దండ వేయడం జరిగింది. అదేవిధంగా సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా అతని చిత్రపటానికి పూలదండ వేసిన తరువాత కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణ దేవి మాట్లాడుతూ వసంత పంచమి అంటే సరస్వతి దేవి జన్మించిన రోజు అందుకే ఈ రోజును ఆమెకు అంకితం చేసి పూజిస్తారు. ఈ పండుగ వసంత ఋతువు ప్రారంభంను సూచిస్తుంది. శీతాకాలం నుంచి వసంత ఋతువు ప్రారంభాన్ని సూచిస్తుంది కాబట్టి దీనికి వసంత పంచమి అని పేరు వచ్చింది.సుభాష్ చంద్రబోస్ 1897 సంవత్సరంలో ఒడిషా రాష్ట్రంలోని కటక్ పట్టణంలో జానకి నాథ్ బోస్, ప్రభావతి బోస్ అనే పుణ్య దంపతులకు జన్మించాడు. ఇతని విద్యాభ్యాసం కటక్ లోని రావేన్ష స్కూల్లో చేశాడు 1920 సంవత్సరంలో భారతీయ సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరై అందులో నాలుగో స్థానంలో నిలిచాడు ప్రతిష్టాత్మకమైన ఇండియన్ సివిల్ సర్వీస్ నుండి వైదొలగి భారత స్వాతంత్ర సమరంలో పాల్గొన్నాడు. భారత ప్రజలను బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలలో తమతో పాటు చేరమని పిలుపునిచ్చాడు బ్రిటిషర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ధీరుడు శాంతి వల్ల స్వాతంత్రం రాదని మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వాతంత్రం ఇస్తానని దేశ ప్రజలకు నడిపిన ధైర్యశాలి నేతాజీ 1943 సంవత్సరంలో ఆజాద్ హిందూ ఫౌజ్ ను,ఏర్పాటు చేశారు ఇతని జీవితం ధైర్యానికి త్యాగానికి దేశభక్తికి ప్రతీక ఆయన ఆలోచనలు పోరాటం ఈరోజుకి యువతను ప్రేరేపిస్తూనే ఉన్నాయి. యువతనే దేశ భవిష్యత్తు అని విశ్వసించి వారిని జాగృతం చేయాలని ప్రయత్నించారు. 1945 సంవత్సరం ఆగస్టు 18న విమాన ప్రమాదంలో చనిపోయినట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది అతను చనిపోలేదని కొందరు నమ్ముతారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణదేవి, ఉపాధ్యాయులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, కె.వెంకటయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

